క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

అనంతగిరి: 104లో పనిచేస్తున్న ఉద్యోగులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తుకారం, కార్యదర్శి మహేందర్, మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, రాఘువేందర్, మైపాల్ పాల్గొన్నారు.

బీజేపీ టికెట్‌కు దరఖాస్తు



టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న మల్లేష్‌పటేల్

పూడూరు: పార్టీ కోసం పని చేస్తున్న తనకు పరిగి టికెట్ ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్ గురువారం పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఇరవై ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతున్నానని తెలిపారు. సామాన్య కార్యకర్త నుంచి పూడూరు మండల పార్టీ అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నానని వివరించారు.

ఎమ్మెల్యే కృషితో గ్రామాభివృద్ధి

సర్పంచు నరేందర్‌రెడ్డి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి కృషితో గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందిందని సర్పంచ్ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మిట్టబాసుపల్లిలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో గ్రామంలో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని గుర్తు చేశారు. గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచు గోవింద్, మాజీ సర్పంచు ఇస్మాయిల్, నాయకులు మల్లప్ప, బాబాఇస్మాయిల్, చిన్న నర్సిములు, బస్వరాజ్ , జగదీషలు ఉన్నారు.

ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి



ఆందోళన చేస్తున్న మండల ఉద్యోగులు

కుల్కచర్ల: సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని గురువారం జిల్లా కేంద్రంలో మండల ఉద్యోగులు నిరసన తెలిపారు. విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్న తమకు సరైన గుర్తింపు లభించడం లేదని ఆరోపించారు. నాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు తమ పోరాటాన్ని నిర్విరామంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు గాంగ్యానాయక్, విజయ్‌కుమార్, రాజు, మైపాల్, రమేష్, బాలకృష్ణ, పాల్గొన్నారు.

కూలిన భవనం పైకప్పు

భయాందోళనలో స్థానికులు



కూలిన స్లాబ్

తాండూరు: భవన నిర్మాణ పనులు చేస్తుండగా పైకప్పు కూలిన ఘటన పట్టణంలోని యాదిరెడ్డి చౌక్ ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఓ వైద్యురాలు ప్రైవేట్ ఆస్పత్రి నిర్మాణం చేపట్టింది. నాలుగవ అంతస్తు పైకప్పు పనులు చేస్తుండగా పైకప్పు కూలిపోయింది. దీంతో పలువురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో పక్కనే ఉన్న ఇంటిపై శిథిలాలు పడడం ద్దాయి. భారీగా శబ్దం రావడంతో స్థానికలు భయాందోళనకు గురయ్యారు. నిబంధనలు పాటించని నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వానొస్తే కరెంట్ కట్

- చెట్ల పొదల్లోంచే విద్యుత్ తీగలు
- కరెంట్ సరఫరాకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు
- సర్వసభ్య సమావేశాల్లో మండిపాటు



గంగ్యాడలో చెట్ల పొదల్లో ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలు



గొల్లగూడ వద్ద నీళ్లల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నవాబుపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం మండలంలోని పలు గ్రామాల్లో చెట్ల పొదల్లో నుంచి విద్యుత్ వైర్లు వెళ్తున్నాయి. వైర్ల కింద ఉన్న చెట్లు కరెంట్ తీగలను అల్లుకుని కప్పేస్తున్నాయి. దీంతో గాలివాన వస్తే మంటలు చెలరేగి విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పాటుతోంది. మండలంలోని మైతాప్‌ఖాన్‌గూడ, అక్నాపూర్, ఎల్లకొండ, లింగంపల్లి, నారెగూడ, గంగ్యాడ, చిట్టిగిద్ద, పులుమామిడి తదితర గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు చెట్ల పొదల్లో చిక్కుకొని ఉన్నాయి. దీంతో గాలి వీచినప్పుడల్లా కరెంటు సరఫరా నిలిచిపోతోంది. మళ్లీ కరెంటు రావాలంటే సిబ్బంది వచ్చి వైర్లు సరిచేసే వరకు కనీసం ఒక్క రోజైనా పడుతుంది.

సర్వసభ్య సమావేశాల్లో అధికారుల తీరుపై మండిపాటు

కరెంట్ సమస్యలపై ప్రతి సర్వసభ్య సమావేశంలో విద్యుత్ అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలుపుతున్నారు. అయినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.

పట్టించుకోని అధికారులు

గ్రామాల్లోని విద్యుత్ వైర్లు చెట్లపొదల్లో అల్లుకొని ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెట్లపొదల్లో విద్యుత్ తీగలు



మండలంలోని మైతాప్‌ఖాన్‌గూడలోని ప్రధాన చౌరస్తాలో ఉన్న విద్యుత్ తీలు పూర్తిగా చెట్ల మధ్యలో ఉన్నాయి. దీంతో కరెంటు సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నవాబుపేట నుంచి మైతాప్‌ఖాన్ గూడ వరకు ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ తీగలు మొత్తం చెట్ల పొదల్లో అల్లుకుపోయాయి. అధికారులు స్పందించి చెట్లను తొలగించి విద్యుత్ తీగలను వేరు చేయాలి.

– అనితారెడ్డి, సర్పంచ్, మైతాప్‌ఖాన్‌గూడ

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వర్షం నీరే

గొల్లూడ గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ వర్షాకాలం వస్తే చుట్టూ నీళ్లు చేరుతాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆ ప్రదేశం నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ని మార్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేదు. ఏదైనా జరిగితే అధికారులే బాధ్యత వహించాలి.

– శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్, గొల్లగూడ

సమస్యలు పరిష్కరిస్తాం

మండంలోని పలు గ్రామాల్లో సమస్యలు ఉన్నాయి. ఇది వరకు కొన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాం, ఇంకా కొన్ని గ్రామాలున్నాయి. విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లను నరికివేయడానికి ప్రస్తుతం నిధులు లేవు. రాగానే అన్ని గ్రామాల్లో చెట్లను తొలగిస్తాం.

– మండల ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: పెంచిన నిత్యావసర సరకుల ధరలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పరిగి బస్టాండ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర ధరలు చాలా ఎక్కువ పెరిగాయన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాలు రెండింతలు పెరిగాయని ఆరోపించారు. కూలీ పనులు చేయగా వచ్చిన డబ్బులు సత్యావసరాలకే సరిపోతుందని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డికి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మర్పల్లి: మర్పల్లి ఎస్‌ఐగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డికి జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయమై ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు, మండల ప్రజల సహకరించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఎస్‌ఐని సన్మానం చేసిన వారిలో జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రైతు బంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రవి, మల్లేశం, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్‌మిత్ర తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గిరిజనులు

బొంరాస్‌పేట: కొత్తగా బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గురువారం ఆయా పంచాయతీల సర్పంచులు, మండలాల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, నాయకులు సీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మైసమ్మగడ్డతండాకు రూ.1కోటి30లక్షల40 వేలు, వాల్యానాయక్‌తండాకు రూ.65.20లక్షలు, సీత్యానాయక్‌తండాకు రూ.1కోటి30.లక్షల40 వేలు, మదన్‌పల్లితండాకు రూ.97.80లక్షలు, బాపన్‌చెర్వుతండాకు రూ.1 కోటి63లక్షలు, డిప్లానాయక్‌తండాకు రూ.84.76లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ శేరినారాయణరెడ్డి, బంజారానాయకుడు దేశ్యానాయక్, సర్పంచులు బద్యానాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

గోమాతను పూజించాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



భూమిపూజ చేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: గోమాతను పూజించడం, తల్లిని గౌరవించడంతో సమానమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య అన్నారు. గురువారం కుల్కచర్ల మండలం ఘనపూర్‌లోని శివసాయి దేవాలయ ప్రాంగణంలో గోశాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవును పూజించడమంటే ప్రత్యక్ష దైవాన్ని పూజించడమేనని అన్నారు. గోసంపద వృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్, పాంబండ ఆలయ పూజారి పాండుశర్మ, మార్వాడి నాయకులు పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడండి



మొక్కలకు నీరు పోస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి

దోమ: కోతుల బెడద నుంచి హరితహారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రాజిరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలకు పాదులు చేసి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువైందని, దీంతో గత నాలుగేళ్ల క్రితంతో నాటిన మొక్కలపై వేలాడుతూ ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. అధికారులు కోతులను గ్రామాల నుంచి తరలించేందుకు సర్వే చేసినా ఆచరణలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కలను ధ్వంసం చేయడమే కాకుండా ఇళ్లల్లో చొరబడి అందినకాడికి దోచుకెళ్తున్నాయని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో కోతులు తరలించే వారి ఫోన్ నంబర్లు తీసుకోని కాల్ చేస్తే, అధిక డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కలసి విన్నవిస్తామని, తెలిపారు.

అడుగడుగునా గుంతలే



పీలారం వద్ద కుంగిన బీటీ రోడ్డు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ నుంచి పీలారం, మైలార్ దేవరంపల్లి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధికారులు రోడ్డును బాగు చేయడం లేదు. ఇటీవల గ్రామాల పర్యటనకు వెళ్లిన కలెక్టర్ నారాయణ రెడ్డి రోడ్డు దుస్థితిని చూసి అధికారులపై మండిపడ్డారు. వారం రోజుల్లో రోడ్డు ప్యాచ్ పనులు పూర్తి చేసి, పూర్తిస్థాయి బీటీ రోడ్డుకు అంచనాలు సమర్పించాలని ఆదేశించారు. సరేనని తలూపిన అధికారులు ప్యాచ్ వర్కు చేయలేదు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు పది కిలోమీటర్ల మేర అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కొన్ని చోట్ల బీటీ రోడ్డు పూర్తిగా కుంగిపోవడంతో రాత్రిపూట ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

నాసిరకంగా ఇంకుడు గుంతల నిర్మాణం



సెయింట్ జూడ్స్ వద్ద నిర్మించిన ఇంకుడు గుంత

వికారాబాద్ అర్బన్: భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం మున్నాళ్ల ముచ్చటగా మారింది. రెండు మూడు నెలల్లోనే కూలిపోతున్నాయి. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 2021లో 9 ఇంకుడు గుంతలు నిర్మించారు. అయితే, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీల్లో ఐదు ఇంకుడు గుంతలు, సెయింట్ జూడ్స్ పాఠశాల వద్ద రెండు, వార్డు నంబర్ 24లోని ఎల్‌ఐజీ పార్కు వద్ద ఒకటి, అదే వార్డులోని ఖాళీ స్థలంలో మరో ఇంకుడు గుంత నిర్మించారు. నిర్మాణంలో మున్సిపల్ అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో రెండు మూడు నెలలకే నేలమట్టమయ్యాయి. ఇంకుడు గుంతల్లోకి కనీసం వర్షం నీరు చేరడం లేదు.. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తూతూమంత్రంగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారని ప్రచారం ఉంది. ఒక్కో ఇంకుడు గుంతకు రూ. 25వేల వరకు ఖర్చు చేశారు. వాటి నిర్మాణం బాగలేక లక్ష్యం నీరు గారిపోతుంది.

విగ్రహ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణానికి టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ గురువారం గౌడ సంఘం నాయకులకు రూ.1,01116/– విరాళం అందజేశారు. సందర్భంగా టీడీపీ రాష్ట్ర సాంస్కృతి విభాగం అధ్యక్షుడు చంద్రహాస్, టీడీపీ జిల్లా నాయకులు బాలముకుంద మాట్లాడుతూ.. బహుజన నేతలను స్ఫూర్తిగా తీసుకొని వారి విగ్రహాల ఏర్పాటుకు గౌడ సంఘం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. బానిస బతుకులకు స్వస్తి పలుకుతూ బహుజనలకు రాజ్యాధికారం దక్కాలన్నా సంకల్పంతో కృషి చేసిన సర్దార్ పాపన్నగౌడ్ ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు జోగు వెంకటయ్య, అంజనేయులు, కొండయ్య, విజయ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకయ్య, దోమ మండల టీడీపీ అధ్యక్షుడు విజయభాస్కర్ గౌడ్, మాణిక్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొరివి కృష్ణస్వామి సేవలు మరువలేనివి



దోమ: కొరివి కృష్ణస్వామి జయంతి వేడుకల్లో సంఘం నేతలు

దోమ: బహుజన సమాజ సంస్కర్త, హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సమాజానికి అందించిన సేవలు మరవలేనివని ముదిరాజ్ సంఘం మండల ప్రధానకార్యదర్శి చందు అన్నారు. గురువారం ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం నేతలతో మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 130వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పువ్వుల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్ అభ్యున్నతికి కొరివి కృష్ణస్వామి చేసిన సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు కేశవులు, దోమ గ్రామ ప్రధానకార్యదర్శి గొడుగు వెంకటేశ్, సోషల్ మీడియా కన్వీనర్లు అనంతయ్య, గోవర్ధన్, నవీన్, శివ, ప్రసాద్, ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: పట్టణ కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణ ముదిరాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ మాట్లాడుతూ.. హైదారాబాద్ నగరాన్ని మహానగరంగా తీర్చిదిద్దడంలో కొరివి కృష్ణముదిరాజ్ కృషి ఎంతో ఉందన్నారు. నగర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రజలు ఎన్నటికీ మరువలేరని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్షుడు రామస్వామి, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, ముకుందనాగేశ్వర్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణస్వామి జయంతి వేడుకలు

కుల్కచర్ల: హైదరాబాద్ నగర్ తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... బహుజన కులాల నుంచి రాజ్యాధికారం సాధించి భవిష్యత్తు తరాల వారికి స్ఫూర్తిగా నిలిచిన గొప్ప వ్యక్తి ఆయన అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు చంద్రహాస్, టీడీపీ జిల్లా నాయకులు బాలముకుందం, మాణిక్యం విజయభాస్కర్ గౌడ్, వెంకటయ్య, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్, స్థానిక గౌడ సంఘం నాయకులు జోగు వెంకటయ్య, కొండయ్య, విజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా ముకుందా..



మర్పల్లి: చిన్నారులతో కలిసి కోలాటం ఆడుతున్న పోలీసులు



పూడూరు: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



తాండూరు: తొట్టెల కార్యక్రమం



పెద్దేముల్‌లో..

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆయా గ్రామాల్లో గురువారం కృష్ణామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలలోని చిన్నారులు చిన్ని కృష్ణయ్య, గోపిక వేషధారణలో అలరించారు. కోలాటాలు, దాండియా ఆడుతూ ఉట్టికొడుతూ ఉత్సాహంగా గడిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్ : ఉట్టికొడుతున్న చిన్నికృష్ణులు



కోట్‌పల్లిలో



తాండూర్ టౌన్‌లో



కొడంగల్ రూరల్: శ్రీకృష్ణ దోలారోహణంలో



ధారూరు: దాండియా ఆడుతున్న చిన్నారులు



తాండూరుటౌన్: కృష్ణుడివేషధారణలో బాలిక

స్తంభించిన రాకపోకలు



ధారూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న అలుగు

ధారూరు: ఎగువ ప్రాంతాల్లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగుపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని రుద్రారం– నాగసమందర్ గ్రామాల మధ్య రోడ్డుపై కొత్తగా నిర్మించిన తాత్కాలిక వంతెనపై నుంచి అలుగు పారడంతో రాకపోకలకు 10 గంటల పాటు అంతరాయం కలిగింది. అప్రమత్తమైన పోలీసులు ప్రజలు అలుగు దాటకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేదలకు అండగా కాంగ్రెస్

కుల్కచర్ల: పేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. గురువారం మండలం కుస్మసముద్రం చెరువుముందలి తండాకు చెందిన లింగ్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి బాధిత కుటుంబీకులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, రాజు పాల్గొన్నారు.